ప్రజాశక్తి

శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 5 అనంతపురం

నేడు సీతారాం ఏచూరి సంతాప సభ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను శుక్రవారం నాడు అనంతపురంలో నిర్వహించనున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సప్తగిరి సర్కిల్లోని లలిత కళాపరిషత్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలియజేశారు. సంతాప సభలో టిడిపి ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుబాటి ప్రసాద్, వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వై.విశ్వేశ్వర రెడ్డి, అనంత మేయర్ వసీం, కాంగ్రెస్ నుంచి డాక్టర్ సాకే శైలజనాథ్, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, న్యూడెమోక్రసీ ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ పార్టీ చంద్రశేఖర్, ఎస్‌యుసిఐ రాఘవేంద్ర పాల్గొంటారన్నారు. వీరితో పాటు జిల్లాలోని మేధావులు, రచయితలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని సంతాపం తెలుపుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాగునీటిపై అలసత్వం వద్దు

- ప్రతి నీటి చుక్కనూ సద్వినియోగం చేయాలి
- జలవనరుల అధికారులకు మంత్రి పయ్యావుల ఆదేశం
- ముగిసిన ఐఎబి సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువు పీడిత ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగునీటి నిర్వహణపై ఏమాత్రం అలసత్వం వద్దని జలవనరుల శాఖ అధికారులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. సాగునీటి సలహా మండలి సమావేశం గురువారం నాడు అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో జరిగింది. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తోపాటు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లు పాల్గొన్నారు. వీరితోపాటు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణి, జెసి.అస్మిత్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ సాగునీటి నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి కిలోమీటరుకు అధికారులను, సిబ్బందిని బాధ్యులను చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విధిగా క్షేత్రస్థాయి పర్యటనలు జరిపి ఎక్కడ సమస్యలొస్తే అక్కడ వెంటనే పరిష్కరించే విధంగా ఉండాలని చెప్పారు. హంద్రీనీవా అధికారులు, తుంగభద్ర అధికారులు ఎవరికివారుగా కాకుండా పరస్పరం సమన్వయంతో నీటి నిర్వహణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు.

నిర్వహణ నిధులు రావడం లేదు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రైతుల నుంచి నీటి తీరువాను వసూలు చేస్తున్నప్పటికీ నిర్వహణకు ఇవ్వాల్సిన నిధులను కాడా నుంచి గత కొన్నేళ్లుగా రావడం లేదని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చెప్పారు. జిల్లా నుంచి సుమారు రూ.13 కోట్లకుపైగా నీటి తీరువా కట్టింది ఉందన్నారు. ఇప్పటికైనా ఎన్ని నిధులు రావాల్సి ఉందన్నది అధికారులు చెప్పాలన్నారు. ఆ నిధులైనా వస్తే సాగునీటి పంట కాలువల మరమ్మతులకు ఉపయోగించుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. తుంగభద్ర డ్యామ్ ప్రధాన గేటు కొట్టుకుపోయినప్పుడు యుద్ధ ప్రాతిపదికన గేట్ల ఏర్పాటుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఇంజినీర్ కన్నయ్య నాయుడులను కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానాన్ని ప్రతిపాదించారు. అదే విధంగా గేటు కొట్టుకుపోయిన అంశంపై విచారణకు ఆదేశించాలని కోరుతూ బోర్డుకు లేఖ రాయాలన్న తీర్మానాన్ని ప్రతిపాదించారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్

నీటిని ముందుగా విడుదల చేయాలి ఎమ్మెల్యే బండారు శ్రావణి

మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ కింద పంటలకు ఇబ్బందికరంగా ఉందని, తక్షణం నీటిని విడుదల చేయాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. అజెండాలో పొందుపరచిన విధంగా అక్టోబరు 10వ తేదీ అయితే ఆలస్యం అవుతుందని చెప్పారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ కాలువలను ముందుగా పరిశీలించి, రెండు రోజుల్లో నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

గండిని పూడిస్తేనే ప్రయోజనం ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి

మిడూతూరు వద్ద మిడ్ పెన్నార్ ఉత్తర కాలువకు గండిపడిందని సమావేశం దృష్టికి తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి తీసుకొచ్చారు. ఈ పరిస్థితుల్లో నీరు వదిలినా ప్రయోజనం ఉండదన్నారు. గతంలో తీసిన పూడిక తీసి మట్టి అక్కడే వేయడంతో అది తిరిగి చేరి కాలువలు పూడుకుపోతున్నాయన్నారు. గండిని పూడ్చితేనే ప్రయోజనం అన్నారు. దీనిపై మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో క్షేత్ర స్థాయి పర్యటన జరిపి తక్షణం గండి పూడ్చి నీరు వృథాకాకుండా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో జనాభా పెరిగిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పీఏబీఆర్ నుంచి వస్తున్న నీటి కేటాయింపులను పెంచి తాగునీటి సమస్య లేకుండా చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నేషనల్ పార్కులో ఉన్న చెక్ డ్యాంకు నీరు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిబిసికి నీళ్లు తగినన్ని వదలడం లేదు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

జిబిసికి ప్రస్తుతం 230 క్యూసెక్కులకు మించి రావడం లేదని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి తెలిపారు. దీంతో దిగువనున్న ఆయకట్టుకు నీరందటం లేదని అన్నారు. కరముక్కల వద్ద కాలువ దెబ్బతిందన్నారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

అవగాహన చేసుకోవాల్సి ఉంది సత్యకుమార్, వైద్యఆరోగ్య శాఖ మంత్రి

ఉమ్మడి జిల్లాలో సాగునీటి నిర్వహణపై ఇంకా తాను అవగాహన చేసుకోవాల్సి ఉందని వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఏది ఏమైనా అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాలో నీటిని సద్వినియోగం చేసుకునే విధంగా అందరం కలసి పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సాగునీటి వసతి లేని ప్రాంతం మాది.. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం ఏ మాత్రం సాగునీటి వసతి లేని ప్రాంతంగా ఉందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో బిటిపి ద్వారా ఈ ప్రాంతానికి నీటిని అందిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలోనూ ఈ హామీని ఇచ్చామని గుర్తు చేశారు. భూసేకరణకు నిధులు విడుదల చేస్తే, నిర్మాణ పనులను ప్రారంభించడానికి వీలవుతుందని చెప్పారు.

నీటి కేటాయింపులు ఇలా (టిఎంసిల్లో)

తుంగభద్ర ఎగువ		
ప్రధాన కాలువ వచ్చే నీరు	26.368	
తాగునీటికి	10.00	
సాగునీటికి	16.368	
హెచ్‌ఎల్‌ఎంసికి	2.506	10-08-2024
జిబిసి	2.359	10-08-2024
మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ	1.479	01-10-2024 (మూడు రోజుల్లో)
మిడ్ పెన్నార్ ఉత్తర కాలువ	0.640	01-10-2024
తాడిపత్రి బ్రాంచ్ కెనాల్	1.267	01-11-2024
మైలవరం జలాశయం	1.370	
పులివెందుల బ్రాంచ్ కెనాల్	1.506	01-11-2024

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

పెచ్చులూడుతున్న కార్పొరేషన్ భవనాలు

- మేయర్ ఛాంబర్‌లో కూలిన సీలింగ్
- బాత్రూంలో వస్తువులు ధ్వంసం
- అదనపు కమిషనర్ ఛాంబర్‌కు మేయర్ మార్పు

మేయర్ భవనంలో పెచ్చులూడి కిందపడిన సిమెంట్ ఫలకలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుత భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. భవనం సీలింగ్ పెచ్చులూడి కింద పడుతున్నాయి. రెండు రోజుల క్రితం మేయర్ ఛాంబర్‌లోని మరుగుదొడ్డి భవనం సీలింగ్ కూలి కింద పడింది. పెద్ద సిమెంట్ ముక్కలు పడడంతో బాత్రూంలోని షింక్‌కొళాయి, వాష్ బేసిన్లు ధ్వంసం అయ్యాయి. ఇవి పడిన సమయంలో సెలవు రోజు కావడంతో ప్రమాదం తప్పింది. పని దినాల్లో అయితే ఈ గదిలో అధికారులు, కార్పొరేటర్లు కూర్చొని సమావేశాలు, చర్చలు జరుపుతుంటారు. ఇలాంటి గదిలో సీలింగ్ పెచ్చులూడడంపై సిబ్బంది, కార్పొరేటర్లు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా మేయర్ చాంబర్‌లో సీలింగ్ చాలా వరకు పెచ్చులూడి కింద పడే పరిస్థితి ఉంది. దీంతో మేయర్ ఆ గది నుంచి అదనపు కమిషనర్ గదికి తన ఛాంబర్‌ను మార్చుకున్నాడు.

భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో మరమ్మతుల నిమిత్తం టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ఎవరూ పనులు చేయటానికి ముందుకు రాలేదు. కార్యాలయం నిర్వహణ బాధ్యతలను నిర్వహించే అధికారిని ఒంటెత్తు పోకడతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదనే విమర్శ విన్పిస్తోంది. ఆ అధికారిని అంచనాల రూపకల్పనలో వాస్తవికతను పక్కనబెడుతుండడం కాంట్రాక్టర్లకు సమస్యగా మారుతోంది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు కంప్యూటర్లను సమకూర్చటానికి నాలుగు సార్లు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. మార్కెట్ ధరలను తగ్గించి అంచనాలు రూపొందించి టెండర్లు పిలవటమే ఇందుకు కారణంగా కాంట్రాక్టర్లు చెబుతున్నారు. మార్కెట్లో ప్రముఖ కంపెనీల కంప్యూటర్ ధరలు ప్రస్తుతం ఉన్న ధర కన్నా రూ.10 వేలు తగ్గించి అంచనాలు రూపొందించి టెండర్లు పిలవడంతో ఎవరూ ఆపనులు చేసేందుకు ముందుకు రాలేదు. ప్రముఖ కంపెనీల రివాల్వింగ్ కుర్చీల విషయంలోనూ మార్కెట్ ధర కన్నా తక్కువగా అంచనాలు రూపొందించడంతో కాంట్రాక్టర్లు ఆ పనులు చేసేందుకు కూడా ఆసక్తి చూపలేదు. ఏడాదిన్నర కాలంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు కంప్యూటర్లు లేవు. సొంత ల్యాప్‌టాప్‌ల్లో వారు పని చేస్తున్నా ఉన్నతాధికారులకు చీమకుట్టినట్టైనా లేకపోవటం శోచనీయం. ఓ మహిళా అధికారిణి మోనార్క్‌లా వ్యవహరించడమే ఇందుకు కారణమని అక్కడి సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. ప్రస్తుతం మేయర్ ఛాంబర్ ఆధునీకరణ పనులు చేయటానికి టెండర్లు నిర్వహించినా కొందరు అధికారుల వివాదాస్పద ధోరణులతో ఇవి ముందుకు సాగడం లేదు. గతంలో ఎగ్జామినర్ తలపై పెచ్చులూడి పెక్కులు మీద పడ్డాయి. దీంతో ఆయన తలకు గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు తరచూ పునరావతం అవుతున్నా మరమ్మతుల అంశంపై అధికారుల్లో చలనం రావడం లేదు. ఇంజినీరింగ్ విభాగం అధికారుల్లో కొందరి ఒంటెత్తు పోకడలను నిరోధించే ప్రయత్నాలు ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చేపడతారా.. లేదా.? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. నూతన కమిషనర్ అయినా ఇలాంటి వాటిని చక్కబెడతారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

ఈ నెల 18వ తేదీన గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్ద ఉన్న చెత్త దిబ్బ

ప్రజాశక్తిలో కథనం అనంతరం 19వ తేదీన ఆ ప్రాంతంలో తొలగిన చెత్త దిబ్బ

గుత్తిలో 'చెత్త' తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మున్సిపాల్టీలో నివాసాలు, రోడ్ల వద్ద పేరుకుపోయిన చెత్త తొలగింపుపై అధికారులు స్పందించారు. గుత్తిలో నెలకొన్న అపరిశుభ్రతపై ఈనెల 18వ తేదీన 'మాటలు గొప్ప.. చేతలు 'చెత్త' అన్న శీర్షికన ప్రజాశక్తి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు 18వ తేదీన మున్సిపాలిటీ పరిధిలోని గౌతమపురి కాలనీలో మురుగు కాలువ, సీసీ రహదారిపై ఉన్న చెత్తాచెదారం దిబ్బను జెసిబి ద్వారా తొలగించి ట్రాక్టర్ డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. 19వ తేదీన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా చెర్లోపల్లి కాలనీలో ఉన్న నిజామీ షాదీఖానా పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. నివాసాల మధ్య చెత్త తొలగింపుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చెత్తను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పాలక మండలి సమావేశంలో సభ్యుల ప్రశ్నల వర్షం

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప అధ్యక్షతన గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాల యంలోని సమావేశ భవనంలో పురపాలక మండలి సాధారణ సమావేశం నిర్వహించారు. ఇందులో పలువులు కౌన్సిలర్లు వివిధ సమస్యలపై ప్రశ్నలు సంధించారు. అజెండాలోని అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. అన్ని వార్డుల్లో డ్రెయినేజీల్లో పూడిక తొలగించాలని సభ్యులు కోరారు. వీధి దీపాల ఏర్పాటు, ఎల్‌ఈడి బల్బులు, విడి పరికరాలు కొనుగోలుకు రూ.16 లక్షలు ఖర్చు చేయడం ఏంటని సభ్యులు గోవిందరాజులు, అజయ్‌కుమార్, పద్మజ ప్రశ్నించారు. కేవలం సింగిల్ టెండర్లే ఎక్కువగా నమోదు అవుతున్నాయని, మరిన్ని టెండర్లు ఎందుకు వేయడం లేదని కౌన్సిలర్ ప్రశాంతి నిలదీశారు. మున్సిపల్ కూరగాయల మార్కెట్ షాపులు, రాణి సత్రం ఎదురుగా ఉన్న మున్సిపల్ షాపుల అద్దె, లీజు కాలం ముగిసి ఏడాదైనా వేలం పాటలు నిర్వహించకపోవడం ఏంటని కొందరు ప్రశ్నించారు. ఆయా ప్రశ్నలకు కమిషనర్ దివాకర్‌రెడ్డి, డిఈ సురేష్ సమాధానమిచ్చారు. సమావేశంలో ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, డిప్యూటీ తహశీల్దార్ రఘు, మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి : సిఐ

పట్టణంలో ట్రాఫిక్, వాహనాల రాకపోకలను చక్కదిద్దేందుకు పురపాలక మండలి, మున్సిపల్ అధికారులు పోలీసు శాఖకు సహకరించాలని సిఐ జయనాయక్ విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఛైర్‌పర్సన్ శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి పట్టణంలో పార్కింగ్, ట్రాఫిక్, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పోలీస్ శాఖకు పురపాలక మండలి సహకరిస్తుందని తెలిపారు.

గార్మెంట్స్ పరిశ్రమల్లో ఉత్పాదకత పెంచుకోండి

జాతీయ ఉత్పాదక మండలి డిప్యూటీ డైరెక్టర్ వి.సంజన్న

సమావేశంలో మాట్లాడుతున్న వి.సంజన్న

ప్రజాశక్తి-రాయదుర్గం

రెడీమేడ్ గార్మెంట్స్ పరిశ్రమల్లో వ్యర్థాలను తగ్గించి ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకోవా లని జాతీయ ఉత్పాదక మండలి డిప్యూటీ డైరెక్టర్ వి.సంజన్న సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు గురువారం రాయదుర్గం రెడీమేడ్ గార్మెంట్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు టంకశాల హనుమంతు అధ్యక్షతన పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయం లో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎంఎస్‌ఎంఈ కాంపిటేటివ్ లీన్ స్కీంపై అవగాహన కల్పిం చారు. సంజన్న మాట్లాడుతూ ఉత్పత్తిదారులు ఓ కన్సల్టెన్సీ సంస్థను ఏర్పాటు చేసుకుంటే ఆ సంస్థ ఏడాది పాటు వ్యర్థాల తగ్గింపు, ఉత్పాదక సామర్థ్యం పెంపుపై అధ్యయనం చేసి నివేదిక అందజేస్తుంద న్నారు. దానిని గార్మెంట్స్ పరిశ్రమలో అమలు చేయడం వల్ల వృథా వ్యయాన్ని తగ్గించి ఉత్పాదక సామర్థ్యం పెంచుకోవచ్చు అన్నారు. ఈ కన్సల్టెన్సీకి అయ్యే ఖర్చులో 90శాతం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉత్పాదక మండలి, 5 శాతం ఈ విధానాన్ని ప్రోత్సహించే సంస్థలు భరిస్తాయని, 5శాతం మాత్రమే స్థానికులు భరించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రమోషన్ అధికారి దుర్గేష్, జనరల్ మేనేజర్ నాగరాజురావు, హెచ్‌పిసిఎల్ నైపుణ్యాభివృద్ధి సంస్థ విశాఖపట్నం లీన్ కన్సల్టెంట్ ఎస్ఎస్ చక్రవర్తి, అసోసియేషన్ సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మురళి, కోశాధికారి వెంకటేశులు, సభ్యులు, ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని ఆవులదట్ల, డి.హీరేహాల్ మండలంలోని మురిడి, కళ్లెం గ్రామాల్లో సాగు చేసిన పంటలను గురువారం వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేరుశనగ పంటలో ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితులను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అలాగే మిరప, కంది, తదితర పంటలు రోగాల బారిన పడకుండా వాడాల్సిన మందులు, పద్ధతులను తెలిపారు. పంటలను పరిశీలించిన వారిలో డిస్ట్రిక్ట్ రీసోర్స్ సెంటర్ అనంతపురం సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజకుమారి, కళ్యాణదుర్గం కెవికె శాస్త్రవేత్త శిరీష, డిఆర్‌సి వ్యవసాయ అధికారి శంకర్‌లాల్‌నాయక్, ఏఈఓ ప్రసాద్, రాయదుర్గం ఏవో మహేంద్ర, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

'స్వచ్ఛత హి సేవ'పై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-రాయదుర్గం

'స్వచ్ఛత హి సేవ'లో భాగంగా గురువారం పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్ మిషన్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యకలాపాలపై హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తహశీల్దార్ దృష్టికి ప్రజా సమస్యలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో భూ సమస్యలతో సతమవుతున్న రైతులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు తహశీల్దార్ మునివేలుకు విజ్ఞప్తి చేశారు. టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, మాజీ జడ్పిటిసి జగన్నాథ్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు. పేదలకు రేషన్ సరుకులు సక్రమంగా అందేలా, ప్రజలు నూతన గృహాలు నిర్మించుకునేందుకు ఉచిత ఇసుక రీచ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు. వారి వెంట వెంకటేశులు, తదితరులు ఉన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అనంతపురం నగరంలోని మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో అంబేద్కర్ యువ సేన ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐకెపి కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుండె జబ్బులకు వైద్యులు నాగరాజు, రాఘవేంద్ర చికిత్స చేశారు. 200 మందిని పరీక్షించి 30 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. 140 మందికి ఎకో, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. 20 మందిని ఎన్టీఆర్ వైద్య సేవ కింద వైద్య పరీక్షలకు సిఫారసు చేసినట్లు డాక్టర్లు తెలిపారు. శిబిరం లో తహశీల్దార్ మునివేలు, ఈవోఆర్‌డి దాస్, నాయకులు రామదాస్, అంబేద్కర్ యువసేన నాయకులు సాకే రమేష్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత : సిడిపిఒ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

పౌష్టికాహార మాసోత్సవాల్లో మాట్లాడుతున్న సిడిపిఒ లక్ష్మీ ప్రసన్న

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని కళ్యాణదుర్గం ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న తెలిపారు. పౌష్టికాహార మాసో త్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ఎరడికెర అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పౌష్టికాహారం, పోషకాలు కారు చౌకగా లభ్యమయ్యే ఆకు కూరల గురించి సిడిపిఒ వివరించారు. అలాగే స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆర్‌డిటి, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌డిటి మహిళా విభాగం టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్ష తన 'బాలికలను రక్షిద్దాం–బాలికలను చదవనిద్దాం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిడి పిఒ హాజరై మాట్లాడారు. సామూహిక సీమంతాలు, మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల్యవివాహాలు, బాలిక విద్య, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హిమశేఖర్, యల్లప్ప, ఉపాధ్యాయురాలు షబన, ఎస్‌ఎంసి ఛైర్మన్లు వీరేశ్, వసంత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రామంజనమ్మ, సచివాలయ సిబ్బంది అపర్ణ, మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, లింగమ్మ, త్రివేణి, ఆయాలు లక్ష్మి, ఓబుళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

30 శాతం భూమికి సాగునీరు ఇవ్వాలి

తుంగభద్ర ఎగువ కాలువను ఆధునీకరించాలి-ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవకు సిపిఎం నేతల వినతి

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కరువు నివారణకు జిల్లాలోని 30శాతం భూమికి సాగునీరు అందించాలని సిపిఎం నాయకులు కోరారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యాల కేశవ్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు పొంగి పొర్లుతున్నప్పటికీ హెచ్ఎల్‌సి కాలువ, పెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువల ఆయకట్టుకు నీరు విడుదల కాకపోవడం బాధాకరమన్నారు. చెరువులు, కుంటలు కనీసం పావువంతు కూడా నిండని పరిస్థితి నెలకొందన్నారు. అనంతపురం జిల్లా విడిపోయిన తర్వాత జిల్లాలో నికరంగా 14లక్షల85 వేల ఎకరాల సాగుభూమి ఉందన్నారు. ఇందులో స్థిరీకరించిన ఆయకట్టు 45,224 వేల ఎకరాలు ఉందన్నారు. 2021-22లో సాగు అయిన ఆయకట్టు భూమి కేవలం 4,821 ఎకరాలు మాత్రమే అన్నారు. దీనిబట్టి చూస్తే జిల్లాలో కేవలం 3.04శాతం సాగు భూమికి మాత్రమే నీటి పారుదల సౌకర్యం ఉందన్నారు. తరతరాలుగా సాగునీటి వనరుల అభివృద్ధికి సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల రాష్ట్రంలోనే అతి తక్కువ సాగునీటి వనరులు ఉన్న జిల్లాగా ఉందన్నారు. వ్యవసాయం బతికి బట్ట కట్టాలంటే జిల్లాలో కనీసం 30 శాతం భూమికి సాగునీటి వనరులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించిందని, 2004లో ఏర్పాటైన జయంతి గోష్ కమిషన్, 2009లో స్వామినాథన్ ఫౌండేషన్ వారి నివేదిక, 2012లో ఐసిఎఆర్ న్యూఢిల్లీ కమిటీ వారు ఇచ్చిన నివేదికతో సహా అందరూ జిల్లాలో కరువులను పారదోలాలంటే నదీ జలాలను మళ్లించాలని సిఫార్సు చేశారని గుర్తు గుర్తు చేశారు. కావున ఆ దిశగా ప్రభుత్వం యంత్రాంగం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇకపోతే నిర్లక్ష్యానికి గురవుతున్న తుంగభద్ర ఎగువ కాలువ ఆధునీకరణ చేయాలని కోరారు. కర్ణాటక, అనంతపురం జిల్లాకు ఉమ్మడి కాలువ 105.437 కిలోమీటర్ల వద్ద కర్ణాటక రాష్ట్రం నుంచి 4200 క్యూసెక్కుల సామర్థ్యంతో జిల్లాలోకి నీరు ప్రవేశిస్తుందన్నారు. అక్కడి నుంచి 84,243 కిలోమీటర్ల ప్రవహించి ఎంపీఆర్ జలాశయానికి చేరుతుందని తెలిపారు. బచావత్ కేటాయింపుల ద్వారా ఈ కాలువకు తుంగభద్ర జలాశం వద్ద 50 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయన్నారు. కర్ణాటకకు 17.50 టీఎంసీలు, ఏపీకి 32.50 టీఎంసీలు రావాలన్నారు. ఇందులో జిల్లా వాటా 21.73 టీఎంసీలు రావాలని, వీటితో 1,45,236 ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించాల్సి ఉందన్నారు. అయితే జలాశయం పూడిక వల్ల ఇప్పటి వరకు 80,000 ఎకరాలకు మించి సాగులోకి రాలేదన్నారు. జిల్లా కేటాయింపులు 32.52ఎంసీలు తాగునీటి కోసం కేసీ కెనాల్ నీరు పది టిఎంసిలు మొత్తం 45 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా గతేడాది 26.88 టీఎంసీలు వస్తాయని ప్రకటించిన బోర్డు ఆఖరుకు 16.097 టిఎంసిలు మాత్రమే విడుదల చేశారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కావున ఆధునీకరణ పనులు చేయాలని కోరారు. అలాగే గుంతకల్లు జలాశయ నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. వీటి ప్రాజెక్టుకు జీడిపల్లి నుంచి మొదలుపెట్టి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో రైతులకు సామూహిక బిందు సేద్య పథకాలను పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా పంట కాలువల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాల్లో తాగునీటి పథకాలకు అంతరాయం ఏర్పడకుండా పటిష్టవంతమైన చర్యలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెరువులు, కుంటలను నీటి పారుదల కాలువలతో అనుసంధానం చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై స్పందించిన మంత్రి తప్పకుండా స్పందించి జిల్లాలోని ఆయకట్టు నీరు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ నల్లప్ప, ఎస్ నాగేంద్ర కుమార్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, పోతులయ్య తదితరులు ఉన్నారు.

130 రోజులు సాగునీరు ఇవ్వాలి

రైతుసంఘం నాయకుల వినతి

జిల్లాలో ఆయకట్టుకు 130 రోజులు సాగునీరు అందించాలని, జిల్లాకు 10 టిఎంసిలు తాగునీరు కేటాయించాలని ఏపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. గురువారం ఐఎబి సమావేశానికి హాజరైన మంత్రి పయ్యావుల కేశవులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత రెండు సంవత్సరాలుగా వర్షాలు రాక భూగర్భ జలాలు అడుగంటిపోయి జిల్లాలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ప్రస్తుతం కర్ణాటకలో వర్షాలు రావడంతో తుంగభద్ర డ్యాం లోకి పూర్తి స్థాయిలో వచ్చిందన్నారు. అయినా ఇరిగేషన్ అధికారులు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు ఇవ్వడానికి సిద్ధమై ఆరుతడి పంటలు వేసుకోవాలని ప్రకటనలు చేయడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హంద్రీనీవాకు పది టీఎంసీలు కేటాయించి హెచ్ఎల్‌సి ఆయకట్టు, మిడ్ పెన్నార్ కింద ఉన్న ఉత్తర, దక్షిణ కాలువలు కింద ఉన్న ఆయకట్టుకు 130రోజులు పూర్తిస్థాయిలో నీరు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పండ్ల తోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన 'అనంత' కమిషనర్

ఎమ్మెల్యే దగ్గుపాటికి పూలమొక్క అందజేస్తున్న కమిషనర్ నాగరాజు

అనంతపురం కార్పొరేషన్ : ఇటీవల అనంతపురం కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాగరాజు స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలో ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించేందు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. తాగునీరు, డ్రెయినేజీ సమస్యలపై రోజూ పర్యవేక్షణ ఉండాలన్నారు. ముఖ్యంగా ఎలాంటి విమర్శలు, వివాదాలకు తావు లేకుండా పని చేయాలని సూచించారు.

నేడు మండల స్థాయి క్రీడాపోటీలు

నార్పల : స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు మండల సమన్వయకర్త ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి అధ్యక్షతన, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, చదరంగం, యోగా, తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

23లోపు ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలి

పుట్లూరు : మండలంలోని రైతులు ఈనెల 23వతేదీలోపు ఈక్రాప్ బుకింగ్‌తోపాటు ఈకెవైసి చేయించుకోవాలని ఎఒ కాత్యాయని గురువారం ఒక ప్రకటనలో సూచించారు. పంటలు సాగు చేసిన రైతులు రైతు సేవాకేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది ని సంప్రదించి చేయించుకోవాలని కోరారు.

12 మంది బైండోవర్

యల్లనూరు : మండలంలోని గొడ్డుమర్రి, యల్లనూరు గ్రామాలకు చెందిన 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఈమేరకు గురువారం స్థానిక కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండల మేజిస్ట్రేట్ నాగరాజు ముందు హాజరు పరచినట్లు తెలిపారు.

సీతారాం ఏచూరికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మల్లు స్వరాజ్యం కాలనీలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రామిరెడ్డి, తదితరులు

లలిత కళాపరిషత్‌లో శుక్రవారం నిర్వహించనున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి జయంతి సభను పురస్కరించుకుని గురువారం నగరంలోని పలు కాలనీల్లో ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా నగర సమీపంలో ఉన్న మల్లు స్వరాజ్యం కాలనీలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. తర్వాత అనంతపురం నగరపాలక సంస్థ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో 1వ సర్కిల్ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ శుక్రవారం లలిత కళా పరిషత్‌లో నిర్వహించనున్న సీతారాం ఏచూరి సంతాప సభకు కార్మికులు, ప్రజలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్లు

మంత్రి పయ్యావుల కేశవ్-నగరంలో అట్టహాసంగా మూడు క్యాంటీన్ల ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అన్నక్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల

పేదల కడుపు నిండా అన్నం పెట్టాలన్న లక్ష్యంతోనే అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. గురువారం నగరంలోని ఓల్డ్‌టౌన్‌లోని గుత్తి రోడ్డు, రైల్వేస్టేషన్, బళ్లారి బైపాస్‌లో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌లను అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు ఎన్టీఆర్ కూడు, గుడ్డ, నీడ అందించాలని తపించారన్నారు. ఆయన బాటలోనే సిఎం చంద్రబాబు నడుస్తూ 2014-19లో అన్న క్యాంటీన్లను తీసుకొచ్చారన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అంధికారంలోకి వచ్చాక వాటిని మూసివేయించిందన్నారు. ఈనేపథ్యంలో తిరిగి టిడిపి అధికారంలోకి రావడంతో పేదలకు అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్, నాయకులు ఆదినారాయణ, రాయల్ మురళి, సుధాకర్ నాయుడు, గంగారామ్, మదమంచి స్వరూప, పెండ్యాల శ్రీలత, లలిత్‌కుమార్, స్వప్న, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, పోలన్న, రంగాచారి, రాజారావు, శ్రీలక్ష్మి, రాయల్ మధు, గోళ్ల సుధాకర్‌నాయుడు, సంగా తేజస్విని, ఉమర్, వడ్డే భవాని, తాజుద్దీన్, సైఫుద్దీన్, కృష్ణం రఘు, తాటి మధు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్, ఎస్ఐని కలిసిన టిడిపి నాయకుడు

తహశీల్దార్‌కు బొకే అందజేస్తున్న వేణుగోపాల్ నాయుడు

యల్లనూరు : నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ నాగరాజు, ఎస్ఐ రామప్రసాద్‌ను మండల పరిధిలోని కూచివారిపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు వేణుగోపాల్ నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

-అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టిన నేపథ్యంలో గురువారం జిల్లా పరిషత్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఈతకొమ్మలు, కల్లుకుండలు చేత పట్టుకుని ఈడిగ, గౌడ, ఐదు కులాలవారు సిఎం చిత్రపటం, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఈడిగ, గౌడ, ఐదుకులాల వారికి మద్యం షాపుల నిర్వహణలో 10శాత రిజర్వేషన్ కల్పిస్తూ మంత్రివర్గం తీర్మానం చేయడానికి స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మకూరు : ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు అధ్యక్షతన సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే చంద్రబాబు తన పాలన మార్క్ చూపించారన్నారు. ముఖ్యంగా మెగా డీఎస్సీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పెంపు, అన్న క్యాంటీన్లు ప్రారంభం, స్కిల్స్ సెన్సెస్ సెంటర్ల ప్రారంభం, బీసీలకు 33శాతం రిజర్వేషన్ కల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలపడం వంటివి అమలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

'స్వచ్ఛత హి సేవ'కు అధికారుల గైర్హాజరు

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరవుతున్నట్లు సమాచారం. ఈనెల 17 నుంచి వచ్చేనెల 2వతేదీ వరకూ స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మొదటిరోజు మండల కేంద్రంలో ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హిసేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య కేంద్రం, పలు పాఠశాలల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. అయితే ఈ కార్యక్రమానికి ఇఒఆర్‌డి మినహా మిగతా శాఖల అధికారులు ఎవరూ హాజరు కాకపోవడం గమనార్హం. మొదటి రోజు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తాగునీరు కల్తీ అవుతుండటంతో అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు మండల విస్తరణ అధికారికి దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ఆయన స్పందిస్తూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకూ సమస్యను పరిష్కరించిన పాపానపోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్వచ్ఛత హి సేవ కార్యక్రమానికి అధికారులందరూ హాజరై సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

మిడ్‌పెన్నార్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి దక్షిణ కాలువ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి మాట్లాడుతూ హెచ్చెల్సీ చివరి ఆయకట్టు వరకూ సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు, తల్లికి వందనం కింద విద్యార్థుల తల్లులకు రూ.15వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలంలో ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు. రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ముకుందాపురం గ్రామంలో దళితుల భూమిని అగ్రవర్ణానికి చెందిన సూర్యచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు దౌర్జన్యంగా ఆక్రమించారని, వెంటనే భూమి స్వాధీనం చేసుకుని పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయుడు, నల్లప్ప, నాగార్జున రెడ్డి, మల్లికార్జున, నాగమ్మ ఇతర నాయకులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి లక్షణాలపై అవగాహన

ప్రజాశక్తి-నార్పల

కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో డిపిఎంఒ బాలఓబులు ఆధ్వర్యంలో గురువారం కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో బాక్టీరియం లిప్రే బ్యాక్టీరియా ద్వారా కుష్టు వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి బయట పడేందుకు మూడు నుంచి ఐదేళ్ల కాలం పడుతుందన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, ముఖం, చెవులు, ఎద, వీపుపై నొప్పి లేని బుడిపేలు, కనురెప్పలు, కనుబొమ్మలు రాలిపోవుట, కాళ్ల, చేతుల తిమ్మిర్లు, వాపులు ఉండటం, ముక్కు దూలం అణిగిపోవడం, గాలి ఆడకపోవడం, బొటన, చిటికెన వేళ్లు, మణికట్టు పని చేయకపోవడం, కాలివేలు నేలకు రాసుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే కుష్టు వ్యాధి లక్షణాలుగా భావించి వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ప్రధానోపాధ్యాయుడు నాగేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సూపర్‌వైజర్ ఆకులప్ప, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సీట్లు రాకుండా అడ్డుపడటం బాధాకరం

మాజీ ఎమ్మెల్యే.వై.విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో కొత్తగా మెడికల్ సీట్లు రాకుండా స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుపడటం తగదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. గత ప్రభుత్వంలో మాజీ సిఎం జగన్ 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారన్నారు. ఈ సంవత్సరం పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పాడేరులో మెడికల్ కళాశాలలు ప్రారంభం కాబోతున్న సందర్భంగా 750 మెడికల్ సీట్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. అయితే కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లి కళాశాలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వలేమని, ఆ సీట్లు తమకొద్దని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం బాధాకరమన్నారు. ఈ నిర్ణయం వల్ల మెడికల్ విద్యను అభ్యసిస్తామని ఆశ పడిన విద్యార్థులకు నిరాశ ఎదురైందన్నారు. ప్రయివేటు విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను నిర్వీరం చేయాలని సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. గతంలో లా (పి-పి) పద్ధతి ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం పేరుతో ప్రభుత్వ వ్యవస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా దోచిపెట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం మెడికల్ విద్యను కూడా సామాన్యులకు అందని ద్రాక్షలా చేశారన్నారు.

మారుతుందన్నారు.గతంలో కూడా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో 2014 బి2019లో యాజమాన్య కోట ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రుల మీద పెనుబారం మోపారని,ఫీజులు ఐదు లక్షల 25 వేల రూపాయల నుండి 24 లక్షల 20వేల రూపాయలు వరకు యాజమాన్య కోట ఫీజులు పెంచారని గుర్తు చేశారు.దీంతో మెడికల్ సీట్లు చదవాలనుకున్న విద్యార్థులు ఫీజులు కట్టడానికి అప్పుల పాలయ్యారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉన్నందున మెడికల్ కళాశాలలకు నిధులు రాబట్టి 17 మెడికల్ కళాశాలలను పూర్తి చేసి విద్యార్థులకు వైద్య విద్యను అందించడంతోపాటు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసులో వ్యక్తికి జీవితఖైదు

ఏడుగురికి ఏడేళ్ల జైలు

అనంతపురం క్రైం : హత్యకేసులో అనంతపురం 4వ సెషన్స్ జడ్జి కోర్టు గురువారం సంచలన తీర్పు ఇచ్చింది. జడ్జి శోభారాణి 13 మంది సాక్షులను విచారించి నేరం రుజువు అయినందున 8 మంది నిందితుల్లో ఒకరికి జీవిత ఖైదు, ఏడుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నిందితుల్లో బసిరెడ్డి రమేష్‌రెడ్డికి జీవిత ఖైదు, కె.సూర్యనారాయణరెడ్డి, ఎల్.సుదర్శన్‌రెడ్డి, ఆర్.లక్ష్మి, ఎం.నాగరాజు, ఎం.చంద్రాయుడు, సి.హరినాథరెడ్డి, ప్యాపిలి మురళీకి చెరో ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. ఈ కేసును పిపి సృజన ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పామిడి యుపిఎస్ సిఐ, కోర్టు మానిటరింగ్ సిస్టం సిఐ ఆర్.ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుళ్లు సౌరెడ్డి, లక్ష్మీనారాయణలు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచి, నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేశారు. అప్పటి దర్యాప్తు అధికారి ఆర్.రవిశంకర్‌రెడ్డి సహా పి.పి మరియు పోలీసు అధికారులు, కోర్టు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

రాకెట్ల తండాలో పోషకాహార మహోత్సవం

ప్రజాశక్తి-ఉరవకొండ

పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండల పరిధిలోని రాకెట్ల తండా అంగన్వాడీ కేంద్రంలో పోషన్ (పోషకార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ రబియాబీ, ఏఎన్ఎం పద్మావతి పోషహోకారంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోషకాహర పదార్థాలు ఉండే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు వంటివి ఆహారంలో ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. ఒకే రకమైన ఆహారం భుజిస్తే పోషకార లోపం ఏర్పడి రక్తహీనతకు దారితీస్తుందని వివరించారు. పసిపిల్లలకు ఆరునెలల వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే సరిపోతాయని, ఆరునెలల తర్వాత అదనపు ఆహారం ఇవ్వాలని సూచించారు. అనంతరం అంగన్వాడి సిబ్బంది సజ్జమ్మ పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. తర్వాత ఆరునెలల అబ్బాయికి అన్న ప్రాసన నిర్వహించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

'స్వచ్ఛత'లో మేయర్ మహమ్మద్ వసీం

ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మేయర్ మహమ్మద్ వసీం సూచించారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం నగర పాలకసంస్థ కార్యాలయ సమావేశ భవనంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజుతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. రోడ్ల మీద ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదన్నారు. అలాగే ఉద్యోగులు ఎక్కువ సమయం కార్యాలయంలో ఉంటారని వారు కూర్చునే ప్రదేశాల్లో పాత దస్త్రాలు ఉంటే వాటిని భద్రంగా మరో ప్రదేశంలో ఉంచుకోవాలన్నారు. దుమ్మూ ధూళి ఎక్కువగా ఉంటే పలు రుగ్మతలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎసిపి హరిప్రసాద్, ఇఇ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ నెటికల్లు, బిల్ కలెక్టర్ చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాన్, ఉపాధ్యాయుడు దేశాయి నాగరాజు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలో మూడవరోజు గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా మండల ప్రత్యేక అధికారి షేక్ షఫీ ఆధ్వర్యంలో పారిశుధ్య, దోమల నివారణ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పుష్పావతి, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, ఎంఇఒలు మల్లారెడ్డి, హరికృష్ణ, పశు వైద్యులు డాక్టర్ రమేష్, పిఆర్ ఎఇ సుధాకర్, ఎపిఎం ఆంజనేయులు, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఇఒఆర్‌డి శైలజారాణి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమాదేవి, ప్రధానోపాధ్యాయుడు నగేశ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మరుగుదొడ్ల ఆవశ్యకత, పొడి చెత్త, తడి చెత్త తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఒ బాలఓబులు, హెల్త్ సూపర్‌వైజర్ ఆక్కులప్ప, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు, శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులు చరణ్, పరశురాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని పలు పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు.

స్వచ్ఛతపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అతిథులు

స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వర్ణాంధ్ర విజన్-2047 యాక్షన్ ప్లాన్ తయారు చేసేందుకు సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా మండల ప్రత్యేకాధికారి షేక్ సఫీ మండలంలోని అన్ని శాఖ అధికారులతో స్వర్ణాంధ్ర విజన్‌పై చర్చించారు. ఈ చర్చలో ఆయా సమస్యలను జిల్లా పరిషత్ కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు పి.మల్లారెడ్డి, హరికృష్ణ, ఇఒఆర్‌డి మాధవరెడ్డి, వైస్ ఎంపిపి పుష్పావతి, పశువైద్యాధికారి రమేష్, ఎఒ పృథ్వీసాగర్, హౌసింగ్ ఎఇ శివారెడ్డి, జెఇ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.